మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

మాజీ ప్రజాపతినిధులతో మున్నూర్ కాపు సంఘం నాయకులు

జన్నారం, ఆగస్టు 27 : జన్నారం మండలంలోని తాజా మాజీ ప్రజా ప్రతినిధులను ఆర్ఆర్ఎస్ ఫంక్షన్ హల్‌లో మంగళవారం మున్నూర్ కాపు సంఘం మండలాధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్, సభ్యులు కొతం శంకరయ్య, గోపి సత్యనారాయణ ఆధ్వర్యంలో సన్మానించారు. సన్మాన గ్రహీతలు మాజీ ఎంపీపీ మాదాడి సరోజ, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, మహ్మద్ రియాజుద్దీన్, ఎన్ అశారాజ్, జాడి గంగాధర్, గోపాల్‌రెడ్డితోపాటు అన్ని జీపీల సర్పంచులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్నూర్ కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు

కర్నె నరేందర్

రాజమౌళి

దుర్గం మహేశ్వర్

దండేపల్లి, ఆగస్టు 27 : పీఆర్టీయూటీఎస్ జిల్లా కార్యవర్గంలో దండేపల్లి మండలం నుంచి పలువురికి చోటు కల్పించినట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు రావణవేణి రవి, మల్యాల మల్లేశ్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా కర్నె నరేందర్, దుర్గం మహేశ్వర్, మల్లూరి వినోద్, కార్యదర్శులుగా తనుగుల రాజమౌళి, లగిశెట్టి సురేందర్, ఎండీ గఫూర్, రాచకొండ శ్రీనివాస్, షరీపుద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఆవుల నర్సింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందన్నారు. ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, రాసపెల్లి రవికి కృతజ్ఞతలు తెలిపారు.

సమయపాలన పాటించని వైద్యులు

డాక్టర్ల కోసం లైన్‌లో వేచి ఉన్న రోగులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 27 : కుమ్రం భీం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని రోగులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఓ వైపు విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా.. అవేవీ పట్టకుండా ఓపీలో డాక్టర్లు అందుబాటులో ఉండడంలేదు మండిపడుతున్నారు. మంగళవారం ఓపీలో 10:15 నిమిషాల వరకు డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే విషయంపై దవాఖాన సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా, ఈ విషయం దృష్టికి రాలేదని, తెలుసుకొని చెబుతానని వెల్లడించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కెరమెరి, ఆగస్టు 27: పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండలంలోని మోడీ కేజీబీవీని మంగళవారం ఆయన సందర్శించారు. భోజనశాల, నిత్యావసర సరుకుల గోదామును తనిఖీ చేశారు. సరుకులు నాణ్యతగా లేవని, భోజనంలో మెనూ ఎందుకు పాటించడం లేదని ఎస్‌వో మీనాను ప్రశ్నించారు. వసతి గృహంలో పనిచేసే వర్కర్లను వెంటనే నియమించేలా చూడాలని ఎంపీడీవో మహ్మద్ అమ్జద్‌పాషాకు సూచించారు. అంతకుముందు కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో మహ్మద్ అమ్జద్ పాషా, ఐటీడీఏ ఏఈ నజీముద్దీన్, మోడీ పంచాయతీ కార్యదర్శి శ్రవంతి, మాజీ జడ్పీటీసీ ఆత్రం లక్ష్మన్‌రావ్, ఆదివాసీ మహిళా నాయకురాలు కోవ ఇందిరా, కేజీబీవీ, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తీజ్

లక్సెట్టిపేట, ఆగస్టు 27 : పట్టణంలోని సత్యసాయి నగర్, లంబాడీతండాలో మంగళవారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాలనీల్లో సంత్ సేవాలాల్, జగదాంబా అమ్మవార్లకు ఉపవాసాలతో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ సురేశ్ నాయక్, లంబాడీ కుల పెద్దలు తారాచంద్, రవీందర్, తిరుపతి, శ్రీనివాస్, రవి, యువతులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

జన్నారం, ఆగస్టు 27 : మండలంలోని కొత్తపేటలో తీజ్ సంబురాలునిర్వహించారు. యువతులు, మహిళలు మొలకెత్తిన గోధుమ బుట్టలను నెత్తిన పెట్టుకొని సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలోని నదిలో నిమజ్జనం చేశారు.

ఖైర్‌గూడలో..

రెబ్బెన, ఆగస్టు 27: మండలంలోని ఖైర్‌గూడ గ్రామంలో తీజ్ ఉత్సవాలు వైభవంగా నిర్వహించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, గ్రామపెద్దలు, మహిళలు, యువతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రి, ఆగస్టు 27 : రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య డిమాండ్ చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం మందమర్రి మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సత్తయ్యతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, మంచిర్యాల పట్టణాధ్యక్షుడు మహేందర్‌ను మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

విజయవంతం చేయండి

లక్సెట్టిపేట, ఆగస్టు 27 : ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ నాయకుడు దుంపల రంజిత్ పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ఏపీఎం విజయలక్ష్మికి వీవోఏలతో కలిసి ధర్నాలో పాల్గొననున్నట్లు వినతి పత్రం అందజేశారు.

బెజ్జూర్, ఆగస్టు 27 : ఐకేపీ వీవోఏల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెళిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వీవోల అధ్యక్షుడు పెద్దల సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

ఒకరి అరెస్ట్

కాగజ్‌నగర్, ఆగస్టు 27 : పట్టణంలోని నౌగాంబస్తీలో మట్కా ఆడుతున్న ఆజీల్‌ను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ మంగళవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు బస్తీలో తనిఖీ చేసి పట్టుకున్నట్లు, అతని వద్ద రూ.20వేలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అజీజ్‌పై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

హామీలు అమలు చేయాలి

బెల్లంపల్లి, ఆగస్టు 27 : సింగరేణి కార్మికులకు వంద శాతం కారుణ్య నియామకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు పరచాలని బెల్లంపల్లికి చెందిన టీబీజీకేఎస్ కేంద్రకమిటీ సంయుక్త కార్యదర్శి దాసరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సి.హెచ్ రమణలు డిమాండ్ చేశారు. మంగళవారం భూపాలపల్లిలో అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్లు వారు పేర్కొన్నారు. లాభాల వాటా ప్రకటించి 35 శాతం లాభాల వాటా ఇప్పించాలన్నారు. కార్మికుల ప్లేడేలను ఎలాంటి కోత లేకుండా ఇప్పించాలని కోరారు. కార్మికులందరికీ 240 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలని తీర్మానించినట్లు వెల్లడించారు.

కాసిపేట : దుకాణాలు బంద్ చేయిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

సిర్పూర్(యు)లో మూసి ఉన్న దుకాణాలు

వాంకిడి : ధర్నా చేస్తున్న తుడుందెబ్బ ఆదివాసీ సంఘాల నాయకులు

ఏజెన్సీ ప్రాంత బంద్ సంపూర్ణం

ఏజెన్సీ ప్రాంత రక్షణకు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన ఏజెన్సీ బంద్.. జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో అన్ని చోట్లా రాస్తారోకో చేపట్టారు. ఉదయం నుంచి టీ స్టాళ్లతో సహా అన్ని వ్యాపార దుకాణాలను మూసివేయించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని, జీవో ఎంఎస్ నంబర్3ను కొనసాగించాలని, ఐటీడీఏలోని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఆదివాసీ పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేయాలని, లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిరిజన చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

– కాసిపేట/దండేపల్లి/చింతలమానేపల్లి/బెజ్జూర్/కెరమెరి/సిర్పూర్(యు)/వాంకిడి/జైనూర్, ఆగస్టు 27

- కాసిపేట మండలంలోని దేవాపూర్ పంచాయతీతో పాటు ఆయా గ్రామాల్లో తుడుందెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు, తుడుందెబ్బ మండల గౌరవాధ్యక్షుడు ఆత్రం జంగు, మండలాధ్యక్షుడు సంద్ర భూమయ్య, ఉపాధ్యక్షుడు సిడాం శంకర్, నాయకులు మడావి తరుణ్, మరప పవన్, రజిని, ఆత్రం వంశీ, మరప పవన్, సిడాం హనుమంతు తదితరులు పాల్గొన్నారు.
- దండేపల్లి మండలం తాళ్లపేట, ముత్యంపేటలో వ్యాపార సంస్థలు బంద్ పాటించాయి. మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కనక జంగు, అడాయి కాంతారావు, సోయం జంగు, రాంపటేల్, శ్రీనివాస్, బాపు, ఎల్లయ్య, సోము, మాన్కు, దాము, రాజేశ్, భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.
- చింతలమానేపల్లి మండల వ్యాప్తంగా దుఖానసముదాయాలు, విద్యా సంస్థలు బంద్ పాటించాయి. ఆదివాసి సంఘాల నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘాల నాయకులు, తదతరులు పాల్గొన్నారు.
- బెజ్జూర్ మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులు దుకాణాలను బంద్ చేయించారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొడ్ప శంకర్, కోర్తె తిరుపతి, విజయ్, దేవాజి, బక్కయ్య, మహేశ్ తదితరలు పాల్గొన్నారు.
- కెరమెరి మార్కెట్ సంపూర్ణంగా బంద్ పాటించారు. ఉదయం నుంచి టీ స్టాల్స్‌తో సహ అన్ని వ్యాపార దుకాణాలు మూసి ఉంచడంతో మండలంలో బంద్ విజయవంతమైంది.
- సిర్పూర్(యు) మండల కేంద్రంలో వ్యాపారస్తులు సంపూర్ణ బంద్ పాటించారు.
- వాంకిడిమండలంలో బంద్ సంపూర్ణమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిరిజన ఆదివాసుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.
- జైనూర్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వచ్ఛందంగా వాణిజ్య కూడలిలో దుకాణాలు, ప్రైవేట్ పాఠశాలలు మూసివేశారు. ఆదివాసీలు మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి తహసీల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ తీశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల ఐకాస రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవ్‌రావ్, ఆదివాసీ సంఘాల నాయకులు కుమ్ర భగవంత్‌రావ్, మెస్రం అంబాజీ, సోయం గుణవంత్‌రావ్, గేడం గణపత్ రావు, కొట్నాక దౌలత్ రావు, కనక రాంజీ, కుమ్ర దుందే రావ్, ఉర్వేత జంగు, కుమ్ర దేవుషావ్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెజ్జూర్‌లో దుకాణాలను బంద్ చేయిస్తున్న నాయకులు



చింతలమానేపల్లిలో ఎంపీడీవోకు వినతిపత్రం..

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

వాంకిడి, ఆగస్టు 27 : విద్యార్థుల ఆరోగ్యపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం డీటీడీవో రమాదేవితో కలసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, స్టాక్ రూం, వంటగదిని పరిశీలించారు. ఉపాధ్యాయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇక్కడ ఎంపీడీవో, తహసీల్దార్ ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి, వార్డెన్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వాంకిడి : వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఆగస్టు 27 : తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు గోలేటి మారుతి ఇటీవల మృతిచెందాడు. కాగా, సంస్థ ద్వారా మంజూరైన చెక్కును బాధిత కుటుంబానికి కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే అందించారు. కలెక్టర్‌లోని తన చాంబర్‌లో రూ.5.36 లక్షల చెక్కును మారుతి భార్య శారద, కుతురు అనూషకు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కబ్జాలను అరికట్టాలి

మంచిర్యాల (ఏసీసీ), ఆగస్టు 27 : జిల్లాలోని చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, అధికారుల అండతో రియలెస్టేట్ వ్యాపారులు అక్రమ వెంచర్లు వేస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. వాటిని అరికట్టాలని మంగళవారం తహసీల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపల్ పాలకవర్గం ప్రతిపాదించిన సాయికుంట చెరువు సుందరీకరణ పనుల్లో చెరువు పూర్వ హద్దులు వదిలి, కరకట్టలు పోయడం వల్ల ప్రభుత్వ ఆశయం దెబ్బతినడంతోపాటు, రియలెస్టేట్ వ్యాపారులు, అధికారులకు వరంగా మారిందని విమర్శించారు. విద్యార్థి సంఘ నేతలు షేక్ సల్మాన్ పాషా, జుమ్మిడి గోపాల్, చేరాల వంశీ, పురెల్ల నితీశ్, శివతేజ, అఖిల్ ఉన్నారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

లక్సెట్టిపేట, ఆగస్టు 27 : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ దవాఖాన భవనంతో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల పనులను సంబంధిత అధికారులు, నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆర్డీవో రాములు, డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కోటేశ్వర్, డీఈ రాజ్‌కుమార్, ఏఈ మోబిన్, ఎంఈవో రవీందర్, డీఐవో అంజయ్య, కళాశాల ప్రిన్సిపాల్ కల్వాల లక్ష్మణ్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, కౌన్సిలర్లు రాందేని వెంకటేశ్, నాగభూషణం, చింత సువర్ణ, సురేశ్ నాయక్ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ లాక్కుంటున్రు..

లక్సెట్టిపేట, ఆగస్టు 27 : 'నా పింఛన్‌ను ఇద్దరు కొడుకులు లాక్కుంటున్నారు సార్.. నాకు ఇస్తలేరు.. ఇబ్బంది పెడుతున్నరు..' అంటూ లక్సెట్టిపేట 7వ వార్డు గంపలపల్లికి చెందిన వృద్ధురాలు లక్ష్మి ఎమ్మెల్యేకు చెప్పుకుంటూ కన్నీరు పెట్టుకున్నది. స్పందించిన ఎమ్మెల్యే పోలీసులను పిలిచి, వృద్ధురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు.

దండేపల్లి మండలంలో..

దండేపల్లి, ఆగస్టు 27 : దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు, లింగాపూర్ మోడల్ స్కూల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం రెబ్బెన్‌పెల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. డీఈవో వీరయ్య, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో దుర్గాదాస్, మాజీ ఎంపీపీలు గడ్డం శ్రీనివాస్, జాబు కాంతారావు, మాజీ జడ్పీటీసీ గడ్డం నాగారాణి–త్రిమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

గుడిపేటలో..

హాజీపూర్, ఆగస్టు 27 : గుడిపేటలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో రాములు, డీఆర్డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్ రావ్, విద్యుత్ శాఖ ఏడీ రాజశేఖర్, తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండే, ఎంపీడీవో మధుసూదన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తోట రవి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్, ఆగస్టు 27: పట్టణంలోని ఏసీసీ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, డీఈ ఖైసర్, ఎంఆర్టీ డీఈ పెద్దిరాజం, ఏడీఈ వేణుగోపాల్, ఎంఆర్టీ ఏడీఈ శరత్, ఏఈ ఎస్ జాన్ తదితరులున్నారు.

పంచాయతీ ఎన్నికల ప్రక్రియ షురూ

డ్రాఫ్ట్ ఓటరు జాబితా తయారీలో నిమగ్నమైన అధికారులు

చెన్నూర్, ఆగస్టు 27 : గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించిన పక్రియను అధికారులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ఫిబ్రవరి ఒకటితో ముగియగా, సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో తిరిగి గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. సెప్టెంబర్ 6న గ్రామ పంచాయతీల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాలను ప్రకటించాల్సి ఉంది. అలాగే సెప్టెంబర్9న జిల్లా స్థాయిలో, 10న మండల స్థాయిలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించాలి. సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించాలి. సెప్టెంబర్ 19న అభ్యంతరాలను పరిశీలించాలి. అనంతరం సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితాలను గ్రామ పంచాయతీల్లో ప్రకటించాలి. ఇందుకోసం సంబంధిత అధికారులు పంచాయతీల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాలు తయారు చేస్తున్నారు. గడువులోగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాను తయారు చేయడంలో అధికారులు బిజిబిజీగా ఉన్నారు.

దాతల ఆర్థిక చేయూత

పెంచికల్ పేట్, ఆగస్టు 27 : మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన సీడెం శ్రీనివాస్ ఈ నెల 18న పొలంలో పనులు చేస్తుండగా, పిడుగుపాటుతో మృతి చెందాడు. భార్య, ఇద్దరు బిడ్డలు, కొడుకు ఉండగా, పెద్ద దిక్కు కోల్పోవడంతో నిస్సహాయ స్థితిలో ఉన్నారు. వారి పరిస్థితి తెలుసుకున్న యువకులు రాచకొండ గణేశ్ ఆధ్వర్యంలో కుటుంబానికి చేయూత అందించాలనే ఉద్దేశంతో సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. ఈ రకంగా సేకరించిన మొత్తం రూ.31,015ను మంగళశారం బాధిత కుటుంబానికి అందజేశారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 27 : కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీకి ఎనికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని డిపో గేట్ వద్ద మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ దివాకర్, నాయకులు మోహన్ బాబు, లక్ష్మణ్, ఎజాజ్, అలీ, అశోక్, భారతి, గోవింద్, తులసీరాం, రవి, డేవిడ్, రమేశ్, గోపి, సులేమాన్, నర్సయ్య, సురేశ్ ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి

లక్సెట్టిపేట, ఆగస్టు 27 : ప్రతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఎల్ఆర్ఎస్ ప్రక్రియ సకాలంలో పూర్తిచేసి, అప్పగించాలని మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియతో పాటు గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

హాజీపూర్, ఆగస్టు 27 : మండలంలోని రాపల్లి పునరావాస కాలనీలో నిర్మిస్తున్న శివ పంచాయతన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రాఘవేంద్ర శర్మ, కడియం బాలాజీ శర్మ, కొండపల్కల సాంబశివ శర్మ బృందం సమక్షంలో వైభవంగా సాగాయి. మొదటి రోజు గణపతి పూజ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసంతో పాటు ధాన్యపుష్ప, ఫలశయ్యాది వాసాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన ఏర్పాటు చేశారు.

వాంకిడి కేజీబీవీలో వైద్య శిబిరం

వాంకిడి, ఆగస్టు 27 : వాంకిడి కేజీబీవీలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 81 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. జ్వరంతో ఉన్న ఇద్దరి రక్త నమూనాలు సేకరించారు. రక్త హీనత అనుమానితులుగా ఉన్న నలుగురిని పీహెచ్‌సీకి తరలించారు.

అత్యాచార యత్నం కేసులో జైలు శిక్ష

కెరమెరి, ఆగస్టు 27: అత్యాచార యత్నం కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమాన విధిస్తూ ప్రిన్సిపల్ జేఎఫ్‌సీఎం కోర్ట్ ఆసి ఫాబాద్ మెజిస్ట్రేట్ జక్కుల అనంతలక్ష్మి తీర్పు ఇచ్చినట్లు కెరమెరి ఎస్ఐ విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2022 ఏప్రిల్ 4న మండలంలోని అగర్‌వాడ గ్రామంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహిళపై అదే గ్రామానికి చెందిన నిందితుడు చాకటి భీంరావ్ ఆమెపై అత్యాచారయత్నంకు పాల్పడ్డాడు. దీంతో ఆమె గట్టిగా అరవడంతో బయటకి పారి పోయాడని, బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేర కు అప్పటి ఎస్ఐ కళ్యాణ్ కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడు చాకటి భీంరావ్‌కు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 4వేల రూపాయలు జరిమాన విధించారని తెలిపారు.

పత్తి మొక్కలు పీకేయడంపై ఆవేదన

పీకేసిన పత్తి మొక్కలను చూపుతున్న శ్రీను, కమల, ఇంద్ర

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 27 : కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సల గ్రామంలోని తమ చేనులో మంగళవారం అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా పత్తి మొక్కలను పీకేశారని రైతులు పూదరి శ్రీను, నాయిని కమల, నాయిని ఇంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా ఇక్కడ వ్యవసాం చేస్తున్నామని, పట్టా పాస్‌పుస్తకం కూడా ఉన్నదని పేర్కొన్నారు. అయినా అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా పత్తి మొక్కలు పీకేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా, తాము ఎలాంటి మొక్కలను పీకేయలేదని వివరించారు.

సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు 27 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ సూచించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావుతో సమావేశమయ్యారు. 34 వార్డుల్లో కౌన్సిలర్ల సహకారంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, ఆయిల్ బాల్స్, దోమల బెడద లేకుండా శానిటేషన్ కార్మికులతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వెల్లడించారు.

నష్టపరిహారం చెల్లించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 27 : పట్టణంలోని రైల్వే కాలనీ, లోతట్టు ప్రాంతాల్లో వరదతో నష్టపోయిన ఏడు కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సదరు కాంట్రాక్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే వరద నీరు ఇళ్లలోకి వచ్చిందని, పేర్కొన్నారు. బాధితులను ఆదుకోవాలని సూచించారు.

లక్కీస్కీం పేరిట మోసం

బెల్లంపల్లి, ఆగస్టు 27 : బెల్లంపల్లిలో లక్కీ స్కీం పేరిట మోసం చేసి నిర్వాహకురాలు ఉడాయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కాల్‌టెక్స్ ప్రాంతంలో మూడేళ్ల క్రితం ఓ మహిళ జై గణేశ్ ఎంటర్‌ప్రైజెస్ లక్కీ స్కీం పేరిట కార్యాలయం ఏర్పాటు చేసింది. ప్రతి నెలా రూ.650 చొప్పున 20 నెలలు చెల్లించాలి. స్థానికంగా ఏర్పాటు చేసుకున్న ఏజెంట్ల సాయంతో 999 మంది సభ్యులు డబ్బు కట్టారు. ప్రతి నెలా లక్కీ డ్రా తీసి, విజేతకు విలువైన వస్తువులు ఇస్తామని ఆశ చూపారు. ఇలా రూ.6 కోట్ల వరకు స్కీంలో జమ అయ్యాయి. ఆ తర్వాత ఓనర్ తన సొంతూరు నిర్మల్ జిల్లాకు ఉడాయించింది. కార్యాలయం కూడా ఎత్తివేసింది. మోస పోయామని గ్రహించిన సభ్యులు ఒక్కొక్కరుగా బయటకువస్తున్నారు. న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలపై విచారణ చేపట్టాలి

నస్పూర్, ఆగస్టు 27 : శ్రీచైతన్య విద్యాసంస్థల అవినీతిపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా మౌలిక వసతులు మాత్రం కల్పించడంలేదని ఆరోపించారు. నాయకులు రెడ్డి చరణ్, రాహుల్, తిరుపతి, సిద్ధార్థ, కార్తీక్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

దండేపల్లి, ఆగస్టు 27 : దండేపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ, విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారుల సమన్వయంతో వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. వైద్యాధికారులు అనిల్, సతీశ్, సిబ్బంది ఉన్నారు.

బూడిదగడ్డ బస్తీలో కార్డన్ సెర్చ్

బెల్లంపల్లి, ఆగస్టు 27 : బెల్లంపల్లి పట్టణంలోని 20, 21, 22వ వార్డుల పరిధి బూడిదగడ్డ బస్తీలో మంగళవారం వన్ టౌన్ పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. బెలంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బస్తీలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని 45 బైకులు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. డాగ్ స్క్వాడ్‌తో అనుమానితుల ఇళ్లలో గంజాయి కోసం సోదాలు చేశారు. బెల్లంపల్లిలో గంజాయి నిర్మూలనకు నార్కోటిక్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామని వెల్లడించారు.

నూతన కార్యవర్గం

దహెగాం, ఆగస్టు 27 : యాదవ సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వరిగెల పాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా బొల్లబోయిన రవికుమార్ యాదవ్, ఉపాధ్యక్షులుగా చెన్నబోయిన లింగమూర్తి యాదవ్, చరణ్‌యాదవ్, చెన్నబోయిన చంద్ర, ప్రధాన కార్యదర్శిగా గొట్ల మల్లేశ్ యాదవ్, కోశాధికారిగా గొట్ల తిరుపతి యాదవ్, యూత్ అధ్యక్షుడిగా కుర్ర సతీశ్‌యాదవ్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అవగాహన పెంచుకోవాలి

కెరమెరి, ఆగస్టు 27 : చట్టాలు, నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని షీ టీం సభ్యులు అన్నారు. మండలంలోని ఝరి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు, సిబ్బందికి నేరాలపై అవగాహన కల్పించారు. షీ టీం సిబ్బంది డబ్ల్యూహెచ్‌సీ సునీత, డబ్ల్యూపీసీ స్వప్న, హెచ్ఎం భరత్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 27 : ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి గ్రామ సమీపంలోని వట్టివాగు కెనాల్‌లో మంగళవారం బొందగూడ గ్రామానికి చెందిన సాగ్రిబాయ్(32) మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఆసిఫాబాద్ సీఐ సతీశ్ తెలిపారు. ఆమె కొడుకు ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. సాగ్రీబాయ్ మతిస్థిమితం కోల్పోయింది. సోమవారం మధ్యాహ్నం తన కొడుకు అశ్విన్‌తో కలిసి కెనాల్‌పై నడుస్తుండగా, ప్రమాదవశాత్తు పడిపోయి మృతిచెందింది. మంగళవారం మధ్యాహ్నం సాగ్రీబాయి తండ్రి ఉత్తమ్, తమ్ముడు సంతోష్‌లు కాలువ వైపు వెళ్లగా, అందులో మృతదేహం కనిపించింది. సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతులు ఆందోళన చెందవద్దు

మందమర్రి రూరల్, ఆగస్టు 27 : రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని చెన్నూర్ సహాయ వ్యవసాయ సంచాలకుడు బానోతు ప్రసాద్ సూచించారు. మండలంలోని సండ్రోన్‌పల్లి రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రుణమాఫీ కాని రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 27 : రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఏవో మిలింద్ కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. రేషన్‌కార్డు లేనివారు, వారి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, పట్టా, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో ధ్రువీకరణ పత్రంపై కార్యదర్శి సంతకం చేయించి, వ్యవసాయశాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

చెన్నూర్, ఆగస్టు 27 : రాష్ట్ర ప్రభుత్వం షరతులు లేకుండా రైతులకు రుణ మాఫీ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. చెన్నూర్‌లోని పాత తహసీల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దీక్షితులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల అధ్యక్షులు మోర్ల శంకర్, మంత్రి రామయ్య, శంకర్, కోటపల్లి మండల ఇన్‌చార్జి కాశెట్టి నాగేశ్వర్‌రావు, చెన్నూర్ పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి పాల్గొన్నారు.

అన్నదమ్ములకు జైలు శిక్ష

బెల్లంపల్లి, ఆగస్టు 27 : ఒకరి బదులు మరొకరు పరీక్ష రాసిన అన్నదమ్ములకు బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేష్ రెండు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. అంబేద్కర్ నగర్‌కు చెందిన ఎంబడి మల్లేష్ 2013 లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం పరీక్షలు ఎంబడి రాజేందర్ రాస్తున్నాడు. మార్చి 3న నిర్వహించిన పరీక్షను ఎంబడి రాజేందర్ కు బదులు ఎంబడి మల్లేష్ రాయడానికి వచ్చాడు. గమనించిన ఇన్విజిలేటర్ చీఫ్ సూపరింటెండెంట్ సృజన దృష్టికి తీసుకురాగా ఆమె పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌హెచ్‌వో కే. స్వామి కేసు నమోదు చేసుకుని సమగ్ర విచార ణ జరపగా, తర్వాత విచారణ ఎస్‌హెచ్‌వో రఘు జరిపారు. ఈ క్రమంలో కోర్టు కానిస్టేబుల్ కే సురేష్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసుక్యూటర్ అజయ్‌కుమార్ 12 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైందని ఎస్‌హెచ్‌వో వివరించారు.